సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం, 6, అక్టోబర్, 2023



ఆర్టీసీ అమరులకు నివాళి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల త్యాగాల దినాన్ని నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ సెక్రటరీ భీంరావు ఆధ్వర్యంలో అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



బతుకమ్మ చీరెల పంపిణీ 9లో▸

ఆడబిడ్డలకు దసరా కానుకగా ప్రభుత్వం ఏటా బతుకమ్మ చీరెలు ఇస్తోంది. జిల్లా వ్యాప్తంగా మహిళలకు ప్రజాప్రతినిధులు, అధికారులు చీరెలు పంపిణీ చేస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/22.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

స్పాజ్ నిబంధనలు దుర్వినియోగం చేస్తే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: స్పౌజ్ వినియోగించుకొనే ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయులు బదిలీల్లో స్పౌజ్ పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలో ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. వేరే పాఠశాలలను ఎంపిక చేస్తే బదిలీల అనంతరం వాటిని రద్దు చేసి మారుమూల ప్రాంతాల్లో పోస్టింగ్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

'సంక్షేమ పథకాలు అద్భుతం'



చీరెలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అద్భుతమని ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మహిళా సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, డీఆర్డీవో కిషన్, ఎంపీపీ పోటె శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రే, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అమ్జద్, వైస్ ఎంపీపీ వద్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీడీవో పుష్పలత, ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీరాంనాయక్, గాంధారి, విజయ, రాంచందర్, రోహిదాస్, ఆశాబాయి, రాజేశ్వర్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం తదితరులున్నారు.

ఆశ కార్యకర్తల కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆశ కార్యకర్తలు

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు ఆందోళన విరమించాలని కోరగా కలెక్టర్ వచ్చి సమస్యలు తెలుసుకోవాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆందోళనకు వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్తానని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు ఆశ, పార్వతి, లక్ష్మి, స్వప్న, పద్మ, పుష్ప, సునీత తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి



సన్మాన గ్రహీతలతో అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు వయోవృద్ధులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిరాదరణకు గురైన వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. అలాంటి వారుంటే ఆర్డీవో నేతృత్వంలోని ట్రిబ్యునల్‌ను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కేజీబీవీ ఉద్యోగులు, సీఆర్టీలు గురువారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి డీఈవో హామీ ఇచ్చి వారం గడిచినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంజేశారు. వెంటనే లిఖితపూర్వక హామీ ఇవ్వకుంటే నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉద్యోగులు జ్యోతి, మమత, షాహిన్, రిజ్వాన, గణేశ్, రమ తదితరులున్నారు.

గుట్కా వార్



జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో వాహనంలో ఉన్నవారిపై దాడి చేస్తున్న స్థానిక గుట్కా గ్యాంగ్

- అక్రమార్కుల పరస్పర దాడులు
- షాపులో.. నడిరోడ్డుపై ఘటనలు
- దుకాణంలో ఘటనపై నో యాక్షన్
- నడిరోడ్డుపై జరిగిన ఘటనలో అరెస్ట్‌లు
- అయినా గొడవలు సద్దుమణిగేనా?
- పీడీయాక్ట్ నమోదు చేస్తామన్న ఎస్పీ

సాక్షి, ఆదిలాబాద్: రెండ్రోజుల క్రితం రాత్రివేళ జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో నడిరోడ్డుపై ఓ వాహనాన్ని కొంతమంది అడ్డగించి అందులోని ఇద్దరిపై దాడికి పాల్పడ్డారు. ఆ ఇద్దరు మహారాష్ట్రవాసులు కాగా, దాడికి పాల్పడింది ఆదిలాబాద్‌కు చెందిన వారు. మహారాష్ట్రవాసులు గుట్కా వ్యాపారంతో సంబంధమున్నవారే. కాగా, పోలీసులు 'ఈ గొడవ ఆదిలాబాద్, మహారాష్ట్ర వ్యాపారుల మధ్య అని' దాని తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దాడి జరిగింది మహారాష్ట్రవాసులపై అయినప్పటికీ దీనికి అసలు కారణం ఆదిలాబాద్ పట్టణంలో గుట్కా వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యాపారుల మధ్య డబ్బుల వివాదమే.

రెండు స్థానిక గుట్కా గ్యాంగ్‌ల మధ్యే..

గతంలో గుట్కా అమ్మకాలపై నిషేధం ఉండేది. కొన్ని నెలల కిందట రాష్ట్రంలో ఈ నిషేధం ఎత్తివేసినట్లు పోలీసులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఖుర్షీదాపూర్‌లో గుట్కా హోల్‌సేల్ వ్యాపారం చేసే దుకాణాలున్నాయి. గతనెల 29న ఓ వ్యాపారి గ్యాంగ్ మరో వ్యాపారి దుకాణంలోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. దీనిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దాడికి గురైనవారు పేర్కొంటున్నారు. అయితే ఆ దాడులు చేసిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు చేయలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే మహారాష్ట్రలో గుట్కా అమ్మకాలపై నిషేధం ఉంది. దీంతో అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చి గుట్కా కొనుగోలు చేసి ఆ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రెండు రోజుల కిందట మహారాష్ట్రలోని కొందరు వ్యాపారులు ఆదిలాబాద్‌లో గుట్కా కొనుగోలు చేసేందుకు వచ్చారు. మహారాష్ట్ర వ్యాపారులు ఒక దుకాణంలో, మరొకరు ఇంకో దుకాణంలో ఉన్నప్పుడు వారం కిందట జరిగిన గొడవ విషయం చర్చకు వచ్చింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన కొంతమందిని మొన్నటి గొడవలకు ప్రతిదాడి చేసేందుకు ఇక్కడివారే పిలిపించారనే భావనకు వచ్చారు. ఆ మహారాష్ట్ర వాసులు వాహనంలో వెళ్తున్నప్పుడు పంజాబ్ చౌక్‌లో అడ్డగించి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అందులో మహారాష్ట్ర వాసులు ఉండటం, దాడిచేసిన వారు స్థానికులు కావడంతో ఈ వివాదాన్ని ఆదిలాబాద్-మహారాష్ట్ర గొడవలుగా చిత్రీకరించారు. అయితే అంతర్గతంగా ఆదిలాబాద్‌లోని రెండు గుట్కా గ్యాంగ్‌ల మధ్య డబ్బుల వివాదమే గొడవకు కారణమనేది వెలుగులోకి వస్తోంది.

వివాదానికి కారణమిదే..

ఆదిలాబాద్‌లో ముందు నుంచి గుట్కా వ్యాపారంలో ఆరితేరి ఉన్న ఓ వ్యాపారి నుంచి మరో గుట్కా వ్యాపారి సుమారు రూ.20లక్షల విలువైన సరుకు తీసుకున్నాడని చెబుతున్నారు. ఆ డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో కొద్దినెలలుగా వివాదం నెలకొంది. ఆ డబ్బుల విషయంలోనే ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య గొడవలు మొదలయ్యాయి. డబ్బులు రాబట్టుకునే విషయంలో మొదటి గ్యాంగ్ ఒత్తిడి తీసుకురావడంతో రెండో గ్యాంగ్ దీన్ని ప్రతిఘటిస్తూ దాడికి పాల్పడ్డట్లు ఆరోపిస్తున్నారు. ఆ సంఘటన తర్వాత ప్రతిదాడి జరిగే అవకాశం ఉందని భావించి మహారాష్ట్ర నుంచి వచ్చిన వ్యక్తులు ఇందుకోసమే వచ్చారని అనుకొని కారులో ఉన్నప్పుడు నడిరోడ్డుపైనే విచ్చలవిడిగా దాడికి పాల్పడ్డారు.

ఆదిలాబాద్‌లో సంచలనం..

ఈ దాడి జరిగింది మంగళవారం రాత్రి కాగా, వ్యవహారం గురువారం పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో ఆ దాడులకు సంబంధించి వీడియోలు వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించి పట్టణంలోని పలువురు వ్యక్తులు కామెంట్లు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొంతమంది 'ఆదిలాబాద్ పోలీసులు ఎక్కడా?' అని ప్రశ్నించడం.. 'నడిరోడ్డుపై దాడులు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారా?' అని కామెంట్లు చేయడం పోలీసుల తీరును ప్రశ్నిస్తోంది. ఇదిలా ఉంటే.. వైరల్ అయిన వీడియోలో దాడి జరిగినప్పుడు సంఘటన స్థలానికి కొంతమంది పోలీసులు చేరుకున్నప్పటికీ దుండగులు వారిని నెట్టివేసినట్టు కనిపిస్తోంది. వారి చేతిలో మారణాయుధాలు ఉండడంతో పోలీసులు కూడా తీవ్రంగా ప్రతిఘటించనట్లు కనిపిస్తోంది. మొత్తంగా జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయా? లేవా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ దాడులు, ప్రతిదాడులు ఇంతటితో ఆగుతాయా? మళ్లీ మళ్లీ జరుగుతాయా? అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసులు అలర్ట్ అయ్యారు. గుట్కా గ్యాంగ్‌లకు హెచ్చరికలు జారీ చేస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

దాడులు ఆపకుంటే పీడీయాక్ట్ నమోదు చేస్తాం



జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో రోడ్డుపై జరిగిన దాడికి సంబంధించి నలుగురిని అరెస్ట్ చేశాం. ఇందులో ప్రధాన నిందితుడు కూడా ఉన్నాడు. ఈ దాడులు ఇంతటితో ఆపకపోతే ఎవరినీ వదిలిపెట్టం. రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. అయినప్పటికీ హద్దుల్లో ఉండకపోతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తాం.

– డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

నేటి నుంచి బ్రేక్‌ఫాస్ట్



- జిల్లాలోని రెండు స్కూళ్లలో ప్రారంభం
- దసరా తర్వాత మిగతా పాఠశాలల్లో..
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక..	925	46,344
ప్రాథమికోన్నత..	111	25,122
ఉన్నత..	110	12,089
మొత్తం	1,146	83,555

వారం	మెనూ
సోమవారం	ఇడ్లీ, సాంబార్/ గోధుమరవ్వ, ఉప్మా, చెట్నీ
మంగళవారం	పూరి, ఆలుకుర్మ/ టమాటాబాత్, సాంబార్
బుధవారం	ఉప్మా, సాంబార్/ బియ్యం రవ్వ ఖిచ్డి, చెట్నీ
గురువారం	చిరుధాన్యాల ఇడ్లీ, సాంబార్/పొంగల్ సాంబార్
శుక్రవారం	ఉగ్గాని/అటుకులు(పోహ), చిరుధాన్యాల ఇడ్లీ, చెట్నీ/ బియ్యం రవ్వ ఖిచ్డి, చెట్నీ
శనివారం	పొంగల్ సాంబార్/ కూరగాయల పులావ్/పెరుగు చెట్నీ/ఆలుకుర్మ

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమ తల్లిదండ్రులు పొద్దున్నే వివిధ పనులకు వెళ్తుండగా చాలామంది భోజనం చేయకుండానే బడికి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేదాకా నిరీక్షించి నీరసించిపోతున్నారు. ఆకలి బాధతో వారు చదువుపై శ్రద్ధ చూపకుండా అనారోగ్యానికి గురవుతుండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పొచ్చర జెడ్పీఎస్ఎస్, బోథ్ నియోజకవర్గంలోని బోథ్ జెడ్పీఎస్ఎస్ (బాలికలు) లో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పొచ్చర పాఠశాలలో 127 మంది, బోథ్ పాఠశాలలో 107 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. 8.45 గంటలకు విద్యార్థులకు అల్పాహారం పెట్టాలని విద్యాశాఖ అధికారులు సంబంధిత హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఈవో ప్రణీత, అడిషనల్ కలెక్టర్ ఖుష్బూగుప్తా గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. దసరా సెలవుల తర్వాత మిగతా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలో 1,146 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలుండగా, వీటిలో 83,555 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి ప్రస్తుతం మధ్యాహ్న భోజనం అందిస్తుండగా, త్వరలో బ్రేక్‌ఫాస్ట్ కూడా అమలు చేయనున్నారు.

సక్రమంగా అమలయ్యేనా?

అల్పాహార పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తారా? లేదా.. అనే అనుమానాలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇడ్లీ, సాంబార్ తదితర అల్పాహారం మెనూలో పొందుపర్చారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకమే సక్రమంగా అమలు కావడం లేదు. వారానికి మూడురోజుల పాటు ఉడికించిన కోడిగుడ్లు విద్యార్థులకు అందించాల్సి ఉండగా చాలా పాఠశాలల్లో అమలు చేయడంలేదు. కొంతమంది నిర్వాహకులు విద్యార్థులకు నీళ్ల పప్పు, టమాటా చారు, ఉడకని అన్నం పెడుతున్నారు. నాసిరకం భోజనం కారణంగా పలు సందర్భాల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్న విషయం తెలిసిందే. ఎంఈవోల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. అల్పాహార పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం



ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. విద్యార్థుల ఆకలిని నివారించేందుకు, పోషకాహార లోపం తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. పథకం అమలుతో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరుగుతుంది. మొబైల్ యాప్ ద్వారా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాం. శుక్రవారం జిల్లాలోని రెండు పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగతా పాఠశాలల్లో త్వరలోనే పథకాన్ని అమలు చేస్తాం.

– ప్రణీత, డీఈవో

పట్టాలివ్వాలని ఆదివాసీల ఆందోళన



ఆదివాసీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్‌రూరల్: కొన్ని నెలలుగా మావల మండలం బట్టిసావర్గాం శివారు ప్రాంతంలోని 72 సర్వే నంబర్‌లో నివాసముంటున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సీఎం కేసీఆర్ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్తామని వారు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో ఈ నెల 2న ప్రగతి భవన్‌కు మహా పాదయాత్ర చేపట్టారు. కాగా, అనుమతి లేదంటూ పోలీసులు బుధవారం అర్ధరాత్రి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ శివారు ప్రాంతంలోని అర్గుల్ వద్ద యమున ఫంక్షన్ హాల్‌లో బస చేసిన ఆదివాసీలను అరెస్ట్ చేశారు. కలెక్టర్, సీఎం కేసీఆర్‌ను కలిపిస్తామని వారిని బస్సుల్లో గురువారం ఆదిలాబాద్‌కు తీసుకువచ్చారు. కలెక్టరేట్‌కు తీసుకువెళ్లకుండా మావల శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి 44 వద్ద గల స్వాగత తోరణం వద్ద వదిలి పెట్టారు. పోలీసులు మాట తప్పడంతో వారు పాత జాతీయ రహదారిపై బైఠాయించి ఐదుగంటలపాటు ఆందోళన చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ ఆందోళన వద్దకు చేరుకుని కలెక్టర్‌ను కలిపిస్తానని, పలువురికి సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇప్పించేలా కృషి చేస్తానని చెప్పి వారిని కలెక్టరేట్‌కు తరలించారు. వారు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అక్కడికి చేరుకుని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పది మందికి రెండురోజుల్లో సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పిస్తామని చెప్పగా వారు ఆందోళన విరమించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు సంజీవ్, గోడం రేణుక, పెందూర్ పుష్పరాణి, ఇందిర, లలిత తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు



ప్రియాంక | అంబుతాయి | కృష్ణవేణి | పీ కృష్ణవేణి | కృష్ణకాంత్ | శ్రీనివాస్ | వినయ్‌కుమార్ | రాథోడ్ మహేశ్ | అశోక్

పోలీస్ కావాలనే పట్టుదలతో శ్రమించారు. కొందరు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకున్నారు. మరికొందరు స్వయంగా సాధన చేశారు. ఎలాగైతేనేం ఇష్టమైన కొలువు సాధించి కృషి, పట్టుదల ఉంటే సాధించనిదంటూ ఏదీ ఉండదని నిరూపించారు. బుధవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో శిక్షణ పొందిన 80 మందిలో 33మంది యువకులు, 13మంది యువతులు ఉద్యోగాలు సాధించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన ప్రియాంక, కరంజి(టీ)కి చెందిన నల్ల కృష్ణవేణి, బేల మండలం కింది పాలగూడకు చెందిన పెందూర్ అంబుతాయి, సిరసన్న దేవిదాస్, చప్రాలకు చెందిన సిన్నం కృష్ణవేణి, దోప్టాలకు చెందిన ముత్యపు కృష్ణకాంత్, మణియార్‌పూర్‌కు చెందిన మునేశ్వర్ సూరజ్, పాటన్‌కు చెందిన తరుణ్‌రెడ్డి, అవాల్‌పూర్‌కు చెందిన ఎనుగందుల స్వజిత్‌కుమార్, ముక్కె వికాస్, మశాల(బీ)కి చెందిన మంచాల హరికృష్ణ, మంచాల ప్రవీణ్ కొలువులు సాధించారు. బోథ్‌కు చెందిన బోనగిరి వినయ్‌కుమార్, వినయ్, రంజిత్‌రెడ్డి, మర్లపెల్లికి చెందిన వికాస్, హరీశ్, పసుగుట్టకు చెందిన హరివికాస్, పొచ్చెరకు చెందిన రాజశేఖర్‌రెడ్డి, నితిన్‌రెడ్డి, ధన్నూర్‌కు చెందిన బద్దం సాయికిరణ్‌రెడ్డి, సొనాలకు చెందిన రామాయి రంధర్, గొల్లపెల్లి రాజేందర్, బత్తుల శివప్రసాద్, భగత్ ప్రశాంత్, బత్తుల దీపిక, బాలె ప్రవీణ్, తాయేరు సాయికిరణ్, మునిగెల శ్రీనివాస్, అంగపెల్లి రాకేశ్, విజయ్, నార్నూర్ మండలం మహాగావ్‌కు చెందిన రాథోడ్ మహేశ్, తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన కొత్తపెల్లి అశోక్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరితోపాటు మరికొంతమంది జిల్లా యువతీయువకులు కొలువులు సాధించారు.

– సాక్షి నెట్‌వర్క్

– వివరాలు 8లో▸

అక్కడ హెచ్‌ఎంలు.. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోలు

- బదిలీ అయినా అవే బాధ్యతలు
- జిల్లాలోని 18 మండలాల్లో ఒక్క రెగ్యులర్ ఎంఈవో లేని వైనం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న 34మంది ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంఈవోలుగా పనిచేస్తున్న పలువురు ఇతర మండలాల్లోని పాఠశాలలకు బదిలీ అయినప్పటికీ వారినే మండల విద్యాధికారులుగా కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇచ్చోడ, సిరికొండ మండలాల ఎంఈవోగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సీతాగోందికి బదిలీ అయ్యారు. గుడిహత్నూర్ ఎంఈవో మావల మండలం వాఘాపూర్‌కు బదిలీ అయ్యారు. ఉట్నూర్, జైనథ్ మండలాల ఎంఈవోగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు జైనథ్ మండలం కూర పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇంద్రవెల్లి ఎంఈవో తలమడుగు మండలానికి బదిలీ కాగా, బజార్‌హత్నూర్, తాంసి, భీంపూర్ మండలాల ఎంఈవోగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు తాంసి మండలానికి బదిలీ అయ్యారు. నేరడిగొండ, బోథ్ ఎంఈవోకు, నార్నూర్, గాదిగూడ ఎంఈవోకు స్థానచలనం జరగలేదు. అయితే జిల్లాలో 18 మండలాల్లో రెగ్యులర్ ఎంఈవో ఒక్కరూ లేరు. గతంలో ఆ మండలంలో పనిచేస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించేవారు. కోర్టు కేసు కారణంగా కొత్త వారికి ఎంఈవో బాధ్యతలు అప్పగించడం లేదు. ఒక్కో హెచ్ఎం రెండుమూడు మండలాల ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కుంటుపడింది. కొంతమంది ఎంఈవోలు వారికి కేటాయించిన మండలాలకు చుట్టపుచూపుగా వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. మరికొంత మంది ఏదో ఒక మండలంలో వారికి నచ్చిన సమయంలో పాఠశాలలను తనిఖీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. పర్యవేక్షణ కొరవడటంతో కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టమొచ్చినప్పుడు వస్తూ.. నచ్చినప్పుడు వెళ్తున్నారు. కాగా, పాత ఎంఈవోలుగా ఉన్నవారినే కొనసాగించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో మళ్లీ వారినే ఎంఈవోలుగా కొనసాగించనున్నారు. అయితే వీరు పనిచేసేది వేరే మండలాల్లోని పాఠశాలల్లో అయినప్పటికీ ఇతర మండలాలకు వెళ్లి పాఠశాలలను తనిఖీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇటు పాఠశాల విధులు, వారికి కేటాయించిన అదనపు బాధ్యతలు పూర్తిస్థాయిలో నెరవేర్చడం వారికి సవాల్‌గా మారింది.

ఫలించిన అంగన్‌వాడీల పోరాటం



ఒకరికొకరు కేక్ తినిపించుకుంటున్న అంగన్‌వాడీలు

ఎదులాపురం: న్యాయమైన డిమాండ్ల సాధనకు 24రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చింది. గురువారం మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌తో జరిగిన చర్చలు సఫలమైనట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. అంగన్‌వాడీలు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తామని, నెలనెలా వేతనాలు చెల్లిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సహాయ కార్యదర్శులు జితేందర్, పొచ్చన్న, వివిధ సంఘాల నాయకులు బండి దత్తాత్రి, సునీత, వెంకటమ్మ, మంజుల, అంగన్‌వాడీలు సునీత, పార్వతి, పద్మ తదితరులున్నారు

క్లుప్తంగా

రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా 'ఏలేటి'


ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఆదేశానుసారం భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనిఫెస్టో తయారీతో పాటు ప్రచార కమిటీకి కూడా ఆయన కన్వీనర్‌గా కొనసాగనున్నారు. పార్టీలో చేరిన అనతికాలంలోనే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి ముఖ్యమైన బాధ్యత రావడంపై పార్టీ జిల్లా నాయకులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేశారు.

కబడ్డీ పోటీల్లో జోనల్‌స్థాయికి ముధోల్ విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముధోల్: కబడ్డీ పోటీల్లో జోనల్ స్థాయికి ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినయ్, సాయిలు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల లక్ష్మణ్‌చాంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ - 14 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

మొక్కజొన్న పంట ధ్వంసం


కిందపడిపోయిన మొక్కజొన్న పంట

కుభీర్: మండలంలోని హల్దా గ్రామంలో చెదల సాయన్నకు చెందిన మొక్కజొన్న పంటను బుధవారం రాత్రి అడవి పందులు గుంపుగా వచ్చి సుమారు రెండు ఎకరాల వరకు ధ్వంసం చేసినట్లు రైతు తెలిపాడు. మొత్తం నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. తనకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు సాయన్న కోరుతున్నాడు.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: పేకాట స్థావరంపై దాడిచేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని పోన్న ఎక్స్‌రోడ్డులోని దాబాలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇందులో ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి వాసులు ఉన్నట్లు తెలిపారు.

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు




వారంతా పాతికేళ్లలోపు యువతీయువకులు. ఖాకీ కొలువంటే ఎంతో ఇష్టపడ్డారు. అందుకు తగ్గట్టు కష్టపడ్డారు. దీంతో తమ కల నెరవేరింది. గతేడాది పోలీస్ కానిస్టేబుల్ నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల కాగా జిల్లాలోని వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటూ ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలకు సిద్ధమై పరీక్షలను ఎదుర్కొన్నారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ కొలువులు సాధించిన అభ్యర్థుల మనోగతం..

ఖాకీ కొలువుకు అతివలు సైతం...

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా నుండి వందలాదిమంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 40మంది మహిళలు వివిధ విభాగాల్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను దక్కించుకున్నారు.

- నిర్మల్ పట్టణంలోని కావేరి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమైన వారిలో 12మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇందులో రాకేష్, సాయి, శివ, ప్రకాష్, ఉదయ్, సునీల్, కిరణ్, రమణ, గోపి, సమీరుద్దీన్, జి.ఉదయ్, ఇమ్రాన్ ఉన్నారు.

అమ్మకు బహుమతిగా..



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీకి చెందిన 'సరిమెట్ల వంశీ' కష్టపడి చదివి సివిల్ కానిస్టేబుల్ పోలీసు ఉద్యోగాన్ని సాధించాడు. చిన్నప్పుడే అయినవారందరికీ దూరంగా ఉంటూ ఇద్దరి బిడ్డల్ని మిషన్ కుట్టుకుంటూ చదివించింది. మంచి ప్రయోజకులను చేయాలనే ఆ తల్లి ఆలోచనను వంశీ నెరవేర్చి పోలీసు ఉద్యోగాన్ని అమ్మకు బహుమతిగా ఇచ్చాడు. తల్లితో సరిమెట్ల వంశీ

అమ్మానాన్నల కోరిక నెరవేర్చాడు



తాంసి: చిన్నప్పుడే అనారోగ్యంతో అమ్మానాన్నలు మృతిచెందారు. మాది తాంసి కాగా 5వ తరగతిలో అనారోగ్యంతో తండ్రి రాజన్న, రెండేళ్ల వ్యవధిలోనే తల్లి నాగమ్మ మృతిచెందింది. దీంతో ఇద్దరు పిల్లలు రజిత, రాహుల్ బాధ్యతను అమ్మమ్మ జింక లక్ష్మి తీసుకుంది. కూలీ పనులు చేస్తూ మమల్ని చదివించింది. మా అక్క రజితకు వివాహం చేసింది. ప్రస్తుతం కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను.

అమ్మమ్మ జింక లక్ష్మితో బట్టు రాహుల్

ఆటో నడుపుతూ...



తాంసి: కుటుంబ పోషణకు ఆటో నడుపుతున్నాను. మాది మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామం. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. కుటుంబ పోషణ కోసం 2016నుంచి ఆటో నడుపుతున్నాను. 2016లో హైదరాబాద్‌లో శిక్షణ పొంది ఈవెంట్స్‌లో ఉద్యోగం చేజారింది. 2018లో రెండు మార్కుల్లో ఉద్యోగం రాలేదు. ఈసారి నోటిఫికేషన్ వెలువడగానే ఆటో నడుపుతూ ఇంటి వద్దనే సన్నద్ధమయ్యాను. టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. - బండి కిషోర్

వరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలు



తాంసి: ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు అనుకునే రోజుల్లో వరుసగా ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామం మాది. 2017లో గురుకులాల డీఎస్సీలో ప్రతిభ కనబర్చాను. 2018లో కానిస్టేబుల్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి పరీక్ష రాయగా 2ఉద్యోగాలకు ఎంపిక కాగా కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. - పేరంగి అజయ్‌కుమార్

ఆటో డ్రైవర్ కొడుకు..



నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్ కాలనీకి చెందిన ఆకుల శశాంక్ ఇటీవల వెల్లడించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికయ్యాడు. తండ్రి రవి కుటుంబ పోషణకు ఆటో నడుపుతూ ఉండగా తల్లి గోదావరి గృహిణి. తన అన్నయ్య శశిప్రీతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. శశాంక్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంపై పలువురు అభినందిస్తున్నారు. - ఆకుల శశాంక్

తండ్రి లేకున్నా మనోధైర్యంతో....


అరిగెల సోని


చౌహాన్ నిశిత


సంధ్యారాణి

కుంటాల: మండలంలోని కల్లూర్‌కు చెందిన అరిగెల సోని తండ్రి గజ్జారాం చిన్నప్పుడే మృతి చెందాడు. తల్లి భోజవ్వ మతిస్థిమితం కోల్పోయింది. అమ్మమ్మ లచ్చవ్వతో కూలీ పనులకు వెళ్తూనే చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది.

- కల్లూర్‌కు చెందిన చంద్రబాయి భర్త సంతోష్‌లకు ముగ్గురు ఆడపిల్లలే. వీరి చిన్నతనంలోనే తండ్రి మృతిచెందాడు. తల్లి కష్టపడి పెద్దకూతురు వివాహం చేసింది. చిన్న కూతురు చౌహాన్ నిశిత ఉద్యోగం సాధించింది.
- కుంటాలకు చెందిన గడ్డం లక్ష్మి-పోశెట్టిలకు ఇద్దరు కూతుళ్లు. తండ్రి పోశెట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి బీడీలు చుడుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. కూతురు సంధ్యారాణి కొలువు సాధించింది.

తల్లి కష్టానికి దక్కిన ఫలితం



మామడ: మండలంలోని ఆదర్శ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని న్యూటెంబుర్ని గ్రామానికి చెందిన కుర్మ రాజారెడ్డి, నర్సవ్వ దంపతుల కూతురు నిరోషరెడ్డి ఏఆర్ పోలీస్ ఉద్యోగానికి ఎంపికైంది. తండ్రి మరణించడంతో తల్లి నర్సవ్వ బీడీలు, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ చదివించింది.

- మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి నారాయణ, ముత్తవ్వ దంపతుల కూమార్తె బి.పల్లవి సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికైంది.
- అనంతపేట్ గ్రామానికి చెందిన నిట్ట ఎర్రన్న, ముత్తవ్వ దంపతుల కుమారుడు నిట్ట విజయ్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.
- పొన్కల్ గ్రామానికి చెందిన కుంబాల రాజారెడ్డి పద్మ దంపతుల కుమారుడు రాజు ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా కొలువుసాధించాడు.
- అనంతపేట గ్రామానికి చెందిన నిట్ట విజయ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

సోదరుడి ప్రోత్సాహంతో..



బేల: అన్న ప్రసన్నకుమార్ ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించాను. ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాలని సంసిద్ధమయ్యాను. కానీ కరోనా కారణంగా వయస్సు అర్హతను కోల్పోయాను. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను.

- ఎనగందుల స్వజిల్‌కుమార్, అవాల్‌పూర్

- నిరుపేద కుటుంబానికి మండలంలోని ఆవాల్‌పూర్ గ్రామానికి చెందిన ముజ్జే వికాస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

అన్నదమ్ములను వరించిన ఉద్యోగాలు..

సిరికొండ: మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రాథోడ్ మోతిలాల్-లక్ష్మిబాయి దంపతుల కుమారులు రాథోడ్ నాందేవ్, రాథోడ్ అర్జున్‌లకు కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రభుత్వ కొలువులు వరించాయి.

తండ్రి కష్టం ఫలించింది



ఇంద్రవెల్లి: నాన్న కావటి రాములు టైలరింగ్, అమ్మ లలిత కూలీ పనికి వెళ్లి నన్ను చదివించారు. వారి కష్టాలను దూరం చేయాలనే లక్ష్యంతో డిగ్రీ చదువుతూనే కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాను. రెండో ప్రయత్నంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. నా తల్లిదండ్రులు పడిన కష్టానికి తగిన ఫలితం దక్కింది.

- కావటి రూపేష్, ముత్నూర్

- ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన దుర్వ సంజు అన్నదమ్ముల స్ఫూర్తితో రెండో ప్రయత్నంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు.

'ఇంద్రకరణ విజయం' ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి, కవులు

నిర్మల్‌టౌన్: మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సాధించిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ కవి పండితుడైన బొందిడి పురుషోత్తంరావు రచించిన 'ఇంద్రకరణ విజయం' అర్ధశత కావ్యాన్ని మంత్రి నివాసంలో గురువారం మంత్రితో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరావు మాట్లాడుతూ.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హయాంలో నిర్వహిస్తున్న అభివృద్ధికి, ప్రజాసేవకు ముగ్ధుడై అంతఃకరణ శుద్ధితో మనస్ఫూర్తిగా రాసిన కావ్యమే 'ఇంద్రకరణ విజయం' అని పేర్కొన్నారు. ముందుమాటను ప్రముఖ కవి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు రచించాడు. అనంతరం కవులను మంత్రి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, విశ్రాంత ఎంపీడీవో దాట్ల గజ్జారాం, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన


రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

ఎదులాపురం: పత్తిలో గులాబీరంగు పురుగు ఉధృతి నివారించుకోవడానికి రైతులు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని కేవీకే కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ ఆర్థిక సహకారంతో 'అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు' అనే ప్రాజెక్టులో భాగంగా జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పత్తిలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గులాబీరంగు పురుగు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులు, సూచనలను రైతులకు తెలియజేశారు. లింగాకర్షక బుట్టలతో పాటు ఎమమెక్టిన్ బెంజోయెట్ 0.5 గ్రాములు లేదా క్లోరంత్ర నిలిప్రోల్ 0.3 మిల్లీ మీటర్లు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా క్లోరోపైరిఫాస్ 20 ఈసీ 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్త రాజశేఖర్ ఎత్తుమడుల పద్ధతి, కాయ కుళ్లు, తెల్లదోమ నివారణ చర్యలు వివరించారు. రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


రైల్వే ట్రాక్‌పై మృతదేహం

భైంసా: బాసర గోదావరి నది సమీపంలోని యంచ గ్రామ శివారులో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఉంటాయని వివరించాడు. రైలు ప్రమాదంలో చనిపోయి ఉంటాడని వివరాలు తెలిస్తే 8712658591, 8712568510 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య


రాందాస్ మృతదేహం

లక్ష్మణచాంద: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పీచర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని పీచర గ్రామానికి చెందిన పిట్టల రాందాస్ (28) కూలీ పనిచేసి జీవనం సాగించేవాడు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన భార్య గంగమ్మ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట గ్రామంలో నివాసముంటున్న చౌహాన్ రాజు(32) పాముకాటుతో మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని మహూర్ తాలుక కార్తర్‌సింగ్ తండాకు చెందిన రాజు అనుకుంట గ్రామంలో సిమెంట్ ఇటుకల తయారీ చేసే ఫ్యాక్టరీలో మూడు నెలల నుంచి పని చేస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం వేకువ జామున 2.30 గంటల ప్రాంతంలో పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 9గంటలకు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య సుచిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పరామర్శ

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువకుడు బూరం చెన్నమల్లు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

కిడ్నీలో 120రాళ్లు..


కిడ్నీలో నుంచి తీసిన రాళ్లు

నిర్మల్: ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా వందా ఇరవైరాళ్లు. అవి కూడా ఒకే కిడ్నీలో.. చదువుతుంటేనే ఆశ్చర్యంగా ఉంది కదా..! ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అరవై ఏళ్ల ఓ వృద్ధుడు కిడ్నీలో రాళ్ల సమస్యతో ఎన్నో ఆస్పత్రులు తిరిగాడు. ఎన్నో మందులు వాడాడు. ఫలితం మాత్రం దక్కలేదు. ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక అలాగే నొప్పి భరిస్తూ వచ్చాడు. చివరకు నిర్మల్‌లోని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవల తెలుసుకుని వచ్చాడు. ఇక్కడ యూరాలజిస్ట్ శ్రావణ్‌కుమార్ సదరు బాధితుడిని పూర్తిగా పరీక్షించి ఆపరేషన్ చేశారు. ఇక వైద్యులే ఆశ్చర్యపోయేలా.. ఏకంగా వందకు పైగా రాళ్లు ఆయన కిడ్నీలో నుంచి బయటపడ్డాయి. ప్రస్తుతం సదరు బాధితుడు బాగున్నాడని ఆస్పత్రి వైద్యులు శ్రావణ్‌కుమార్, నాశం శశికాంత్ పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ఇలాంటి అరుదైన చికిత్సలనూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా పొందవచ్చని వివరించారు.

అనారోగ్యంతో గర్భిణి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: అనారోగ్యంతో నిండు గర్భిణి మృతిచెందిన ఘటన పట్టణంలోని న్యూకాలనీ గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎస్పీఎం ఉద్యోగి సతీష్ సతీమణి మీనా(30) పురుటినొప్పులతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచనలు మేరకు రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి పచ్చ కామెర్ల వ్యాధి తీవ్రమై చికిత్స పొందుతూ పురుటినొప్పుల్లోనే శిశువు మృతిచెందగా ఆ తర్వాత తల్లి తుదిశ్వాస వదిలింది. మృతురాలికి రెండు సంవత్సరాల పాప ఉంది. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ పరామర్శించారు.

ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రం బాపురావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... బాపు గ్రామంలోని ప్రధాన రహదారిపై బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. స్థానికులు 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆశ్రమ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉట్నూర్‌లో డివిజన్ స్థాయిలో జరిగిన ట్రైబల్ స్పోర్ట్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కె.జారుబాయి(వాలీబాల్), టి.మల్లిక (కబడ్డీ), ఎం.శైలజ(కబడ్డీ)రాష్ట్ర స్థాయిలో జరిగే ట్రైబల్ స్పోర్ట్స్‌కు ఎంపిక కావటం సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పవార్ స్వర్ణలతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది చందు, అనిల్, ధర్మసింగ్, వనిత, సంపూర్ణ, స్వరూపరాణి, సునీత పాల్గొన్నారు.

వడూర్‌లో డెంగీ కేసు నమోదు


మందు పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి డెంగీ సోకడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గురువారం మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. డెంగీ సోకిన ఇంటి పరిసరాల చుట్టూ రసాయన మందు పిచికారీ చేయించారు. ఇళ్ల చుట్టూ నీరునిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. వారి వెంట హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, వైద్య సిబ్బంది దివ్య, ప్రవీణ్ ఉన్నారు.

గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు

- విషజ్వరంతో ఒకరి మృతి
- ఇప్పగూడెంలో వైద్య శిబిరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య లోపం, వాతావరణ మార్పులతో గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పగూడెంకు చెందిన చీకటి వెంకటేష్(30) మూడు రోజుల నుంచి విషజ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేశ్‌కు ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. గ్రామంలోని పలువురికి విషజ్వరాలు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం తాళ్లగురిజాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 35మందికి రక్త పరీక్షలు చేసి ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు అనిష్ తెలిపారు. దీంతో పాటు గ్రామంలో డ్రై డే నిర్వహించి మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల శుభ్రం చేశారు.

స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య


మోహన్‌యాదవ్(ఫైల్)

జైపూర్: వారిద్దరూ ప్రాణ స్నేహితులు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు. ఓ స్నేహితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా మరో స్నేహితుడు జీర్ణించుకోలేక మూడు రోజుల కిందట గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా గురువారం టేకుమట్ల శివారులో మృతదేహం కనిపించింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీరాంపూర్ ఆర్కే-8కాలనీకి చెందిన చందనవేని మోహన్‌యాదవ్ (27) అదే కాలనీకి చెందిన జిలుల అఖిల్ ఇద్దరూ చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. అఖిల్ తండ్రి ఏడాదిన్న కిందట మరణించడంతో తండ్రి సింగరేణి ఉద్యోగం అఖిల్‌కు వచ్చింది. అఖిల్‌కు ఈ ఏడాది జూన్‌లో వివాహం కాగా ఎప్పటికి బయట స్నేహితులతో తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అఖిల్ ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితుడి మరణ వార్త తెలుసుకున్న మోహన్ మనస్తాపానికి గురై అదే రోజు ఇందారం గోదావరి వద్ద వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మోహన్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.